క్లుప్తంగా

అధికారులపై దాడిని ఖండిస్తున్నాం

కందుకూరు: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులపై దాడి అప్రజాస్వామ్య చర్యగా భావిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామని పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీకాంత్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఎన్.రాఘవేందర్, కార్యదర్శి పి.రాజుగౌడ్, కోశాధికారి శ్రీధర్, సభ్యులు సి.వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దాడికి పాల్పడడం బాధాకరం

- ఎంపీడీఓ శైలజ
- బాధ్యులను కఠినంగా శిక్షించాలి



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీడీఓ శైలజ తదితరులు

మహేశ్వరం: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయడం బాధాకరమని, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని మహేశ్వరం మండల ఎంపీడీఓ శైలజ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దాడిని ఖండిస్తూ మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ అధికారులపై దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. దాడికి ఉసికొల్పిన వారిని సైతం పట్టుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సిరినగర్, వాసవికాలనీ, మన్సూరాబాద్, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ గణేష్‌పురికాలనీ, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకు, 11కేవీ గంగా హాస్పిటల్, శ్రీనివాసకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు, 11కేవీ భగత్ సింగ్‌నగర్, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న నర్సింహారావు

కందుకూరు: వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులతో రైతులు లబ్ధి పొందాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ మంగళవారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ ద్వారా శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలతో పాటు నూతన వంగడాలు, సాగు పద్ధతులు, యంత్ర పరికరాలు వివరాలు తెలుసుకోవచ్చన్నారు. లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణమోహన్, ఏఈఓలు ఎల్.రాజు, జగదీశ్వరాచారి, రాఘవేంద్రాచారి, శ్రీహరి, సమీయుద్దీన్, నర్మద, రైతులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహం బహుకరణ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని అంతిరింతిరి కొండపై వెలసిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉప్పల నర్సింహాయాదవ్ ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాన్ని బహుకరించారు. ఆలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ పూజారులకు విగ్రహాన్ని అందజేశారు. అనంతరం విగ్రహదాత ఉప్పల నర్సింహాయాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్‌గౌడ్, ఆంజనేయులుయాదవ్, రామచంద్రయ్య, రవి, కొండల్, మల్లేశ్, మహేశ్, శ్రీశైలం, పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ వాణి
- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వాణి కోరారు. మంగళవారం పుర కార్యాలయంలో సర్వేను ఆన్‌లైన్ చేయడానికి ఏర్పాటు చేసిన సిస్టమ్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుర పరిధిలోని 15 వార్డుల్లో 6,932 ఇళ్లను తాము గుర్తించామన్నారు. ఇప్పటివరకు సుమారు 2 వేల ఇళ్లకు సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లకు ఇబ్బందులు రాకుండా 10 మందికి ఒక్కరిని సూపర్‌వైజర్‌గా నియమించామన్నారు. సర్వేకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: మున్సిపల్ కార్యాలయంలో సిస్టమ్ వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ వాణి

మహేశ్వరం: మండంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల వద్ద వివరాలు సేకరించి ప్రభుత్వం నుంచి వచ్చిన ఫారంలో పొందుపరుస్తున్నారు. మండలంలోని అమీర్‌పేట, గొల్లూరు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను మంగళవారం ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ శైలజారెడ్డి సమగ్ర సర్వేను పరిశీలించారు.



మహేశ్వరం: సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ శైలజారెడ్డి

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. కార్తీకమాసం రెండో మంగళవారం కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

ఇమ్యూనిటీపై అవగాహన



విద్యార్థులకు ఇమ్యూనిటీపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కందుకూరు: వరల్డ్ ఇమ్యూనైజేషన డేను పురస్కరించుకొని గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసీ కళాశాల బృందం మంగళవారం మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు రోగనిరోధకశక్తి శరీరంలో ఏవిధంగా పెంపొందించుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, అనారోగ్యానికి గురికాకుండా ఉండాలంటే ఏం జాగ్రత్తలు పాటించాలనే అంశాలపై ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు వట్నాల ప్రణయచెన్నాగౌడ్, హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జి.గోపాల్‌రెడ్డి, నాయకులు సరికొండ వెంకటేశ్‌గౌడ్, పున్న జ్ఞానేశ్వర్, మంద యాదగిరి, డప్పు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ

కమిషనర్ వాణి

తుక్కుగూడ: గృహాల నుంచి వచ్చే ఆహారం, కూరగాయాల వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేయనున్నట్లు తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ ఏ వాణి తెలిపారు. మంగళవారం పుర పరిధిలోని రావిర్యాల డీఆర్‌సీ సెంటర్‌ను ఈకో విద్యా సస్టేబుల్ సొల్యుషన్ సభ్యులు, చైర్ పర్సన్ బరిగెల హేమలత, కౌన్సిలర్లలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీ ఇంటింటా సేకరించే వ్యర్థాలను ఉపయోగించి ఎరువులను తయారు చేస్తారన్నారు. ప్రజలు వ్యర్థాలను బయటి వేయకుండా సిబ్బందికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, సంస్థ సభ్యులు పావని, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌సీ సెంటర్‌లో చైర్ పర్సన్ హేమలత, కమిషనర్ వాణి

బుగ్గజాతర ఏర్పాట్లలో రాజకీయం తగదు



మాట్లాడుతున్న చీరాల రమేశ్ తదితరులు

మంచాల: బుగ్గ రామ లింగేశ్వర స్వామి జాతర నిర్వహణ విషయంలో రాజకీయం చేయడం తగదని ఆరుట్లలోని ప్రతి పక్షనాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆరుట్ల చౌరస్తాలో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా రాజకీయాలకు తావు లేకుండా అన్ని వర్గాల వారిని కలుపుకొని గొప్పగా ఉత్సవాలు నిర్వహించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు దేవాదాయ శాఖ పేరుతో రాజకీయం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత సంవత్సరం జాతరకు వచ్చిన ఆదాయ లెక్కలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి పక్షనాయకులు చీరాల రమేశ్, పున్నం రాములు, ఎం. కృష్ణ, కొండిగారా బుచ్చయ్య, మార బుగ్గరాములు, నూకం రవి, కొంగర జనార్దన్‌రెడ్డి, నూకం రాజు, వెంకట్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితులను శిక్షించాలి

- తహసీల్దార్ సునీతారెడ్డి డిమాండ్
- ఇబ్రహీంపట్నం కార్యాలయం ఎదుట నిరసన

ఇబ్రహీంపట్నం: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిలపై దాడి చేసిన నిందితులను చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, కడా ప్రత్యేక అధికారిపై దాడులకు నిరసనగా మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడారు. విధులకు ఆటంకపరుస్తూ కలెక్టర్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఐలు పుష్పలత, కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

'ప్రజలను రెచ్చగొట్టడం సరికాదు'

కందుకూరు: ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను రెచ్చగొట్టడం కేటీఆర్, హరీశ్‌రావుకే చెల్లిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మీడియా కో–ఆర్డినేటర్ కప్పాటి పాండు రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌ను ఇతర నియోజకవర్గాలకు దీటుగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. అక్కడ కాలుష్యం లేని ఫార్మాసిటీ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రైతుల అభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై జరిగిన దాడిని సమర్థించేలా కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడుతుండటం సిగ్గుచేటని విమర్శించారు. వారి హయాంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో రైతుల నుంచి బలవంతంగా 14 వేల ఎకరాల భూములు సేకరించలేదని ప్రశ్నించారు. ఇక్కడి రైతుల పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారన్నారు. రైతులను రెచ్చగొట్టి తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలన్న కుటీల నీతిని ప్రజలు గ్రహించాలని కోరారు.

ఐడీ కార్డుల పంపిణీ



విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న దినేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలంలో ఎల్మినేడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పొగాకు దినేశ్ సొంత డబ్బులతో ఐడీ కార్డులు తయారు చేయించి అందజేశారు. ఈ కార్యక్రమంలోబీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బజారు భిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు మారోజు సుధాకర్, రమణ, ఉపాధ్యాయులు గ్యార రాజు, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగారెడ్డి తదితరులు

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

- జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు మండలం అభివృద్ధి చెందడం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి ఇష్టంలేనట్లు ఉందని, అందుకే ఫోర్త్‌సిటీని అడ్డుకునేలా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ కృషి చేస్తున్నారన్నారు. ప్రపంచస్థాయిలో ఫోర్త్‌సిటీ ఏర్పాటు చేసి అందులో స్కిల్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ సిటీ, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వంటి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న ధ్యేయంతో సీఎం పనిచేస్తున్నారని, అందులో భాగంగానే 300ల అడుగుల రహదారి, మెట్రో రైలు నిర్మాణానికి రూపకల్పన చేశారన్నారు. ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే పనులు చేస్తుంటే బీఆర్‌ఎస్ మాత్రం ఓటు రాజకీయం కోసం డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఫార్మాసిటీ పేరుతో కేసీఆర్, కేటీఆర్‌తో కలిసి డ్రామాలు ఆడింది తమకు తెలియదని ప్రశ్నించారు. పవర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి పొలాలన్నీ విద్యుత్ టవర్లు, తీగలమయంగా మార్చింది ఎవరని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్ బేగ్, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కంబాలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, బక్కు పాండురంగారెడ్డి, వరికుప్పల బాబు, ఢిల్లీ కృష్ణ, గాదె కుమార్, ఎగ్గిడి జగదీశ్, సంగం మహేందర్, ఢిల్లీ పరమేశ్, విఘ్నేశ్, శ్రీరాములు, రాజు, జాపాల శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీ వెల్ఫేర్ భవనం ప్రారంభం



ఆరుట్లలో వెల్ఫేర్ భవనం ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మంచాల: ఆరుట్ల గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఎన్టీఆర్ కాలనీ వెల్ఫేర్ భవనం మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరుట్ల గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ ప్రజల సౌకర్యం కోసం దాత మారగోని మాసయ్య గౌడ్ రూ.2లక్షలతో ఈ భవన నిర్మాణం చేయించారని తెలిపారు. కాలనీలో ప్రజల అవసరాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. చదువుకున్న యువకులకు గ్రంథాలయంగా ఏర్పాటు చేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, గుడ్డి మల్ల చంద్రయ్య, రమేష్, భాష, ఎల్లేష్, సురేష్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ ఏపీనగర్‌లోని ఆదివేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు మేనేజింగ్ ట్రస్టీ నోమల అశోక్ గౌడ్, శైలజరాణిలు తెలిపారు. మంగళవారం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాసూత్ర బంధనం, మృత్సంగ్రహణము, పవిత్రాధివాసంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బుధవారం బాలభోగం, అధివాసహోమం, నవకలశస్నపనం, పవిత్రారోపణం, శాతుమురై, తీర్థప్రసాద గోష్ఠి, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, 14న మూల మంత్ర మూర్తి హోమం, విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీమద్భగవద్గీత పారాయణ, హోమం, 15న శ్రీసూక్త హవనం, 25న కలశములతో స్నపన, పవిత్రారోహణము, పూర్ణాహుతి, మహదాశీర్వాదం, బ్రహోత్సవాల్లో భాగంగా 15వ తేదీన శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాసూత్రబంధనము, అంకురారోహణము, వైనతేయపటాధివాసము, మంగళా శాసనము, 16న ఆరాధన, యాగశాల ప్రవేశము, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, 17న ఉత్సవ మూర్తులకు పూర్ణాహుతి, 18న ప్రత్యేక పూల అలంకరణ, సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామి వారి కల్యాణం, 19న అశ్వవాహనం, గ్రామోత్సవం, 20న శ్రీపుష్పయాగం, చక్రతీర్థం, దేవతోద్వాసనము, మహాపూర్ణాముతి, కుంభప్రోక్షణ రక్షా విమోచనం, 21న 108 కలశాలతో ఉత్సవాంతస్నపనము, ఉత్సవ పరిసమాప్తి వంటివి చేపట్టనున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



ఆదివేంకటేశ్వర స్వామి దేవాలయం

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఈత, తాటి, ఖర్జూరా మొక్కలను పెంచేందుకు కార్యాచరణ

కడ్తాల్: నియోజకవర్గంలో గౌడ, కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో కడ్తాల్, మాడ్గుల్ మండలాలకు చెందిన చరికొండ, నాగిళ్ల, ఎక్వాయిపల్లి, మైసిగండి, శెట్టిపల్లి తదితర గ్రామాలకు చెందిన కల్లుగీత కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశానికి గౌడ సంఘం నాయకులతో పాటు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులు, గౌడ సంఘం నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కొన్ని రోజులుగా కల్లుగీత వృత్తి దారులు అనేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సంక్షేమానికి తన సహాయ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. గతంలో తను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో శాసనమండలిలో కల్లుగీత కార్మికుల సమస్యలపై అనేక సార్లు సభ దృష్టికి తీసుకురావడంతో పాటు, అప్పటి మంత్రి, శాసనమండలి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గీత వృత్తి పరిరక్షణతో పాటు, తాటి ఎక్కే క్రమంలో ప్రమాదాలకు గురికాకుండా ప్రభుత్వం, బీసీ కార్పొరేషన్ ద్వారా కాటమయ్య రక్షణ కవచాలను అందిస్తుందన్నారు. గీత వృత్తి పరిరక్షణలో భాగంగా, ప్రతీ గ్రామంలో ఈత, తాటి, ఖర్జూరా మొక్కలను పెంచేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. అదే విధంగా కల్లు గీత కార్మికులకు లైసెన్స్‌లు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. గీత కార్మికులు సహితం చెడ్డపేరు తెచ్చుకోకుండా స్వచ్ఛమైన కల్లు సరఫరా చేయాలని సూచించారు. అనేక సమస్యల మధ్య, ఒడిదుడుకుల మధ్య ఈ వృత్తి నిర్వహిస్తున్న కార్మికులు, రోజు రోజుకు దూరమవుతున్నారని, వారసత్వపు వృత్తిలో పిల్లలు కొనసాగే పరిస్థితి లేదని, వారిని చదివించి గొప్ప వారిగా తీర్చి దిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలో గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు, సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. గీత కార్మికులకు సంబంధించిన సమస్యలతో పాటు, గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వినతులు..

మండల కేంద్రంలో నిర్మిస్తున్న గౌడ కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయాలని, మైసిగండి ఆలయానికి నూతన కమిటీ వేయాలని పట్టణానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు రాములుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు లాల్‌కోట రాములుగౌడ్, వెంకటయ్యగౌడ్, యాదయ్యగౌడ్, అంజయ్యగౌడ్, వెంకటేశ్, శేఖర్‌గౌడ్, సుమన్‌గౌడ్, లక్ష్మయ్య, నాయకులు హన్మానాయక్, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, బీచ్యానాయక్, వెంకటేశ్, జహంగీర్‌అలీ, సుధాకర్‌గౌడ్, లక్ష్మయ్య, మహేందర్, సత్యం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కల్లుగీత కార్మికులు